క్లుప్తంగా

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తమిళనాడు మద్రాస్ శామ్‌సంగ్ కంపెనీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్ పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు వారాలుగా కార్మికులు సమ్మె చేస్తున్నా సౌత్ కొరియా శామ్‌సంగ్ కంపెనీ యాజమాన్యం స్పందించకుండా రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

వైవీయూ వీసీ, రిజిస్ట్రార్‌లను తొలగించాలి

కడప ఎడ్యుకేషన్ : లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణారెడ్డిని వైవీయూ వైస్ చాన్సలర్‌గా, తప్పెట రాంప్రసాద్ రెడ్డిని రిజిస్ట్రార్‌గా నియమించడంతో యూనివర్సిటీ ప్రతిష్ట దిగజారిపోతోందని, వారిని వెంటనే తొలగించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప కాగితాలపెంటలోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు స్వీకరించడంతో విద్యారంగం అభివృద్ధి చెందుతుందని అందరూ ఆశించారన్నారు. కానీ విద్యారంగ అభివృద్ధి తిరోగమనం వైపు నడుస్తోందన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో ఇలాంటి లైంగిక ఆరోపణలు ఉన్న వ్యక్తులు బాధ్యతలు స్వీకరిస్తే విద్యార్థినులు, మహిళలకు రక్షణ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో సంస్థ నాయకులు అజ్మతుల్లా, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని అక్కాయపల్లికి చెందిన ఇస్మాయిల్ అనే యువకుడిపై దీపక్ అనే యువకుడు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగ : కడప నగరంలోని నకాష్, ఓంశాంతి నగర్‌లలో చోరీలకు పాల్పడ్డ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బంగారు నగలను రికవరీ చేసినట్లు సమాచారం.

యువకుల మానవత్వం

కడప అర్బన్ : మార్చురీలో ఉన్న మృతదేహానికి యువకులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మేము సైతం సేవాసంస్థ ఆధ్వర్యంలో కడప రిమ్స్ మార్చురీలో ఉన్న వ్యక్తి మృతదేహానికి రైల్వే పోలీసుల విన్నపం మేరకు మోచంపేటలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వంకధారి రాము, అయ్యవారయ్య, రామరాజు, శివరాం, భానుప్రకాష్, పుల్లయ్య మొదలైన వారు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేస్తేనే రాయితీలు

కడప అగ్రికల్చర్: రైతులు సాగు చేసిన పంట వివరాలు ఈ క్రాప్‌లో నమోదు చేస్తేనే పీఎం కిసాన్, క్రాప్ ఇన్సూరెన్స్ రాయితీలు లభిస్తాయని ఊటకూరు ఏరువాకకేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ పేర్కొన్నారు. పాత కడపలో కడప మండల ఏఓ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సభలో అంకయ్య కుమార్ మాట్లాడుతూ వరి సాగు చేసిన రైతులు చీడపీడలు, తెగుళ్లతో జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఆత్మ డీపీడీ పద్మలత మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు మెహరాజ్, పావని, రైతులు పాల్గొన్నారు.

రైలు ఎక్కుదాం.. ద్వారక చూసొద్దాం!

కృష్ణ భగవానుడు నడియాడిన నేల ద్వారక.. దేశంలో తప్పక దర్శించాల్సిన క్షేత్రాల్లో ఇది ఒకటి. ఆధ్యాత్మికంతోపాటు పర్యాటక ఆనందాన్ని పొందాలనుకునే జిల్లా వాసులు తక్కువ ఖర్చుతో ద్వారకను దర్శించుకునే అవకాశం ఉంది. ఈ ప్రాంతానికి వెళ్లాలంటే కడప నుంచి నేరుగా రైలు సౌకర్యం ఉందనే విషయం చాలా తక్కువ మందికే తెలుసు. ఇంతకు ద్వారకకు కడపనుంచి ఎలా వెళ్లాలి..దర్శనీయ ప్రాంతాలు తదితర అంశాలపై ప్రత్యేక కథనం.

- ఆకట్టుకునే ఆధ్యాత్మిక పర్యాటకం
- కడప నుంచి తక్కువ ఛార్జితో ప్రయాణం



కడపనుంచి ద్వారక వెళ్లే ఓకా ఎక్స్‌ప్రెస్

కడప కోటిరెడ్డిసర్కిల్ : పర్యాటకానికి అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు అనుకూలంగా ఉంటుంది. అందుకే ఎక్కువ మంది పర్యాటకులు తీర్థ యాత్రలకు వెళ్లేవారు. ఈ మాసాల్లో తమ టూర్‌ను ఖరారు చేసుకుంటారు. దేశంలో హిందువులు తప్పనిసరిగా దర్శించాల్సిన నాలుగు క్షేత్రాల్లో ద్వారక ఒకటి. శ్రీకృష్ణుడు కొలువైన దివ్య క్షేత్రాలలో విశిష్టమైనది ఈ ద్వారక. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్ జిల్లాలో ఉంది. ద్వారక నుంచి గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌ను దర్శించవచ్చు. మహాత్మా గాంధీ జన్మించిన పోరుబందర్‌ను వీక్షించవచ్చు. ద్వారకకు 237 కిలోమీటర్ల దూరంలో సోమనాథ జ్యోతిర్లింగాన్ని ద్వారకాధీశుడి ఆలయం, 80 అడుగుల శివుని విగ్రహం ఉన్న నాగేశ్వర జ్యోతిర్లింగం ఇదే మార్గంలో చూడవచ్చు. ద్వారక వెళ్లిన వారు ఆ ప్రాంతానికి చుట్టూ 20–30 కిలోమీటర్ల దూరంలో ఉన్న బర్సాన, గోకులం, గోవర్ధనగిరిలతోపాటు రాధాకుండ్, కృష్ణాకుండ్, లలిత్‌కుండ్ సరస్సులతోపాటు కుసుమ్, సరోవరం, గోమతి ఘాట్, సుధ, సేతులను వీక్షించవచ్చు.

కడప నుంచి వెళ్లాలంటే

కడప నుంచి ద్వారకకు వెళ్లేందుకు నేరుగా రెండు వారాంతపు రైళ్లు ఉన్నాయి. అలాగే గుంతకల్లు నుంచి కూడా ద్వారకకు వెళ్లవచ్చు. కడప నుంచి రామేశ్వరం–ఓకా (16733) ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి ద్వారక చేరుకోవచ్చు. ఈ రైలు ప్రతి శుక్రవారం రామేశ్వరంలో రాత్రి బయలుదేరి కడపకు మరుసటి రోజు శనివారం మధ్యాహ్నం 1.55 గంటలకు చేరుకుంటుంది. తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు, మహబూబ్‌నగర్, కాచిగూడ, నిజామాబాద్, పూర్ణజంక్షన్, జాల్నా, ఔరంగబాద్, నాగర్‌షోల్, సూరత్, వడోదర, అహ్మదాబాద్, రాజ్‌కోట్ మీదుగా సోమవారం ఉదయం 9.20 గంటలకు ద్వారకకు చేరుకోవచ్చు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఓకా–రామేశ్వరం (16734) ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం ఉదయం 9.10 గంటలకు ద్వారకలో బయలుదేరి తెల్లవారు జామున 3.30 గంటలకు కడపకు చేరుతుంది. జనరల్ రూ. 485, స్లీపర్‌లో రూ. 810, థర్డ్ ఏసీలో రూ.2135 టిక్కెట్‌గా నిర్ణయించారు.

మధురై–ఓకా–మధురై మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు (09519/20)లో కూడా ద్వారకకు చేరుకోవచ్చు. ప్రతి శుక్రవారం అర్ధరాత్రి 1.15 గంటలకు బయలుదేరి కడపకు అదేరోజు మధ్యాహ్నం 1.55 గంటలకు చేరుతుంది. ద్వారకకు ఆదివారం ఉదయం 9.30 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ద్వారకలో సోమవారం రాత్రి 10.35 గంటలకు బయలుదేరి బుధవారం సాయంత్రం కడపకు 6.05 గంటలకు చేరుకుంటుంది. ఈ రైలులో జనరల్ రూ. 475, స్లీపర్ రూ. 790, థర్డ్ ఏసీలో రూ. 2095లుగా ఛార్జిగా ఉంది.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



కడప నుంచి ద్వారకకు రెండు రైళ్లు వెళుతున్నాయి. కడప నుంచి అహ్మదాబాద్‌కు మరో రెండు రైళ్లు వెళుతున్నాయి. అక్కడికి వెళ్లిన తర్వాత అహ్మదాబాద్ నుంచి వేరే రైలును ఆశ్రయించి ద్వారకకు వెళ్లవచ్చు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ప్రయాణీకుల వినతి మేరకు అహ్మదాబాద్ వెళుతున్న వెళ్లను ద్వారక వరకు పొడిగించాలని రైల్వే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– జనార్దన్, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్, కడప

10న తపాలా శాఖ ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జాతీయ తపాలా వారోత్సవాలలో భాగంగా ఈనెల 10న అక్టోబర్ అంత్యోదయ దివస్ సందర్భంగా కడప డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తపాలాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కడప డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. మంగళవారం నగరంలోని తపాలా శాఖ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ఆధార్ నమోదు కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 వరకు ఉంటాయన్నారు. ఈ కేంద్రాలు కడప నగరంలోని అప్సర సర్కిల్, బద్వేల్ పరిధిలోని బస్టాండ్ వద్ద , లక్కిరెడ్డిపల్లి పరిధిలోని బస్టాండ్ వద్ద, టి. సుండుపల్లిలో బస్టాండ్, చిట్వేలి పరిధిలోని చక్రంపేట గవర్నమెంట్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైక్ మెకానిజంలో శిక్షణ

కడప ఎడ్యుకేషన్ : కడప–బళ్లారి రోడ్డులోని జనం కోసం బైక్ సర్వీస్ పాయింట్‌లో యువకులకు శిక్షణ ఇస్తున్నట్లు కేంద్రం అధినేత లయన్ పటాన్ ఖాదర్ బాషా తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐటీఐ మెకానికల్ చదివిన యువకులకు 20 రోజుల్లో టూవీలర్ మెకానిజం నేర్పించి, సర్టిఫికెట్ ఇస్తామని పేర్కొన్నారు.

నగరంలో వైద్య విద్యార్థుల ర్యాలీ

కడప అర్బన్ : ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రోజూ ఓ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటరాముడు, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలను పురస్కరించుకుని కడప నగరంలో మంగళవారం వైద్య విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కలెక్టరేట్ వద్ద మహావీర్ సర్కిల్ వరకూ సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ వారోత్సవాలు నిర్వహించి మానసిక సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రారంభంలోనే గుర్తించి వైద్యం అందిస్తే మానసిక రోగులు సాధారణ జీవితాన్ని పొందవచ్చని అన్నారు. అనంతరం మహావీర్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన మెడిసిన్ విద్యార్థులు ప్రజలకు స్కిట్ల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, సునీత, విజయ వాసంత్, సుబ్బయ్య, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ఉద్యోగులకు మధ్యంతర భృతిని ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీ అమలయ్యే వరకు 35 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని సంస్థ కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నియమించిన డాక్టర్ మన్మోహన్ సింగ్ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలగినందున పీఆర్సీ అమలులో మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. అలాగే పీఆర్సీ నూతన కమిషన్ నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా గౌరవాధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజగోపాల్ రెడ్డి, గౌరవ సలహాదారు క్రిష్టఫర్ జాన్, జిల్లా కార్యదర్శులు ఆలమూరు ప్రసాద్, రవి శంకర్, రామ్మోహన్ రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కరీముల్లా



హిఫాజతుల్లా

కడప ఎడ్యుకేషన్ : మున్సిపల్ ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కడప కార్పొరేషన్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరీముల్లా, హిఫాజతుల్లా డిమాండ్ చేశారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు రెగ్యులర్‌గా పదోన్నతులు, బదిలీలు జరగడం లేదని, ఎప్పుడు నిర్వహిస్తారో కూడా తెలియదని అన్నారు. ప్రభుత్వ, పంచాయితీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్టుగానే.. మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని కోరారు. అనంతరం కడప కార్పొరేషన్ యూటీఎఫ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా లింగారెడ్డి, అధ్యక్షుడిగా కరీముల్లా, సహాధ్యక్షులుగా బాలభాస్కర్, పుష్పకుమారి ప్రధాన కార్యదర్శిగా హిఫాజతుల్లా, ట్రెజరర్‌గా మేరీ ప్రసన్న, జిల్లా కౌన్సిలర్లుగా హిఫాజతుల్లా, కరీముల్లా, రూతు ఆరోగ్య మేరీ, మోహనరావు, కార్యదర్శులుగా షేక్ మొహమ్మద్ ఆసిఫ్, మరియరాణి, రెడ్డి లక్ష్మీప్రసన్న, మృదుల, గంగరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా డేవిడ్ వినయ్‌కుమార్, సభ్యులుగా సుమతి, ఆసిఫ్ అహ్మద్‌లను ఎన్నుకున్నారు. ప్రభాకర్, శ్రీనివాసులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ఇసుక సమస్య పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఇసుకను సమృద్ధిగా అందక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరవైందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక ధర అమాంతం పెంచి రూ.6 వేలకు పైగా విక్రయిస్తున్నారని, సామాన్య ప్రజలకు ఇది పెనుభారంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే దిశగా వ్యవహరిస్తున్న కిందిస్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం ఆదేశాలను కూడా లెక్కచేయకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న వల్లూరు ఎస్సైను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతాలైన ఆదినిమ్మాయపల్లి, పుష్పగిరి, మిట్టపల్లి, గాలివారిపల్లిలోని సొంతింటి నిర్మాణం కొరకు ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వార తోలుకున్న వారిపై ఎస్సై దాడులకు పాల్పడుతున్నారనన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధిరామయ్య పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు

కడప స్పోర్ట్స్ : ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ సమైక్యత, నాయకత్వ లక్షణాలు అలవడతాయని ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సూర్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కడప తెలుగుగంగ కాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో మంగళవారం కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంపు–8ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్, వెపన్ ట్రైనింగ్, మ్యాప్ రీడింగ్, ఫైరింగ్ అంశాల్లో శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.నాగశేషాద్రి, టి.ఓబులేసు, సీటీఓలు కిరణ్‌కుమార్, నరేష్ బెహరా, భీమయ్య, సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సి.ఎల్.రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

జైభీమ్ మాల మహాసేన అధ్యక్షుడి ఎంపిక

కడప కార్పొరేషన్ : జై భీమ్ మాల మహాసేన కమలాపురం అధ్యక్షుడిగా డి.గంగరాజును నియమిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్ తెలిపారు. సంపత్ కుమార్ మాట్లాడుతూ కమలాపురం నియోజకవర్గంలో మాలల అభివృద్ధి,వారి ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

రాహుల్ గాంధీ పాలన రావాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పాలన రావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎస్.డి.విజయజ్యోతి పేర్కొన్నారు. జమ్మూ కాశ్మీర్, హర్యానా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ మెరుగైన ఫలితాన్ని సాధించడంతో మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి మరింత ఉత్సాహాన్నిస్తాయని భావిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తిగా రేపు రాబోయే మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ రాణిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీకి రోజులు చెల్లాయని, రాబోయే రోజుల్లో ఎన్డీఏకు గడ్డు కాలం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, అబ్దుల్ సత్తార్, సిరాజుద్దీన్, డాక్టర్ శ్రీనివాసులు, సుశీల్ కుమార్, చెప్పలి పుల్లయ్య, విజయ కుమార్, సుబ్బారెడ్డి, మైనుద్దీన్, రవీంద్రారెడ్డి, జయ సుబ్బారెడ్డి,. గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సంబరాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

ట్రిపుల్–ఆర్ నిధులు జమ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : ట్రిపుల్–ఆర్ పథకం కింద నాబార్డు విడుదల చేసిన రూ. 1368.46 లక్షలు ఉమ్మడి జిల్లాలోని చేనేత సహకార సంఘాల ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని చేనేత ఐక్య వేదిక జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున మంగళవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు విన్నవించారు. ట్రిపుల్–ఆర్ పథకం కింద ఉమ్మడి జిల్లాలోని 110 చేనేత సహకార సంఘాలకు సంబంధించిన ప్రతిపాదనలు 2013లో డైరెక్టరేట్ కార్యాలయానికి పంపారని తెలిపారు. దీంతో 2020–21లో 1368.46 లక్షల రూపాయలు నాబార్డు విడుదల చేసిందన్నారు. సొసైటీల పేర్ల వారీగా మంజూరైన మొత్తం, బ్యాంకు అకౌంట్ల నంబర్లతో సహా నాబార్డు వివరాలను పంపుతూ నిధులు జమ చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకును కోరిందన్నారు. అయితే 18 సహకార సంఘాలు రూ. 222.44 తమకు రుణ బకాయిలు చెల్లించాలంటూ నాబార్డు విడుదల చేసిన నిధుల నుంచి డీసీసీ బ్యాంకు జమ చేసుకుందని పేర్కొన్నారు. అయితే మిగతా చేనేత సహకార సంఘాల ఖాతాల్లో డబ్బులు ఎందుకు జమచేయలేదో అర్థం కావడం లేదన్నారు. మిగతా రూ. 1146.01 లక్షలు డీసీసీ బ్యాంకులో సస్పెన్స్ అకౌంటులో ఉంచారన్నారు. ఇది ఆర్‌బీఐ నిబంధనలకు వ్యతిరేకమని తెలిపారు. ఇప్పటికైనా ట్రిపుల్–ఆర్ కింద వచ్చిన డబ్బును తక్షణమే సొసైటీల అకౌంట్లలో జమ చేయాలన్నారు.

నమామి.. మాతా.. నారాయణి!



వైకుంఠ నాథుడిగా లక్ష్మి సత్యనారాయణస్వామి



కాత్యాయినిగా విజయదుర్గ



కల్పవృక్షంపై కొలువుదీరిన కడప రాయుడు



బాల త్రిపుర సుందరిగా వాసవాంబ



మహాలక్ష్మిగా లలితాంబిక

శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలను కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుల్లతలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. వివిధ బంగారు ఆభరణాలు, పుష్పాలతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆరు గంటల నుంచే భక్తులతో ఆలయాలు పోటెత్తుతున్నాయి. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు నమామి మాతా నారాయణి అంటూ ప్రణమిల్లుతున్నారు.

– కడప కల్చరల్



విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



విజయదుర్గమ్మ సన్నిధిలో రవీంద్రనాథ్‌రెడ్డి



నడివీధి గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



అన్నపూర్ణగా బాల పోలేరమ్మ తల్లి